క్లుప్తంగా

పీఆర్‌సీని వెంటనే విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న మోతీనగర్ ఎలక్ట్రికల్ ఉద్యోగులు

మోతీనగర్: విద్యుత్ ఉద్యోగులకు సంవత్సర కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని విడుదల చేయాలని గురువారం పలువురు ఎలక్ట్రికల్ ఉద్యోగులు నిరసన తెలిపారు. టీఎస్‌పీఈజేఏసీ పిలుపు మేరకు గ్రీన్‌ల్యాండ్ డివిజన్ కార్యాలయంలో పీఆర్‌సీ విడుదల చేయాలని మోతీనగర్‌కు చెందిన విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సమస్య పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎం పాషా, తంగళ్లపల్లి రమేష్, దశరథం, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బి.రమేష్, మహేష్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

5న 'సీఓఈ' అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఇంటర్మీడియట్ అర్హత పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సీఓఈ–2023 పరీక్ష జరుగుతుందని అభ్యర్థులు సకాలంలో హాజరవాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే రావాలని ఆమె సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, పరీక్ష ప్యాడ్ తీసుకురావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ప్రీతి ఆత్మకు శాంతి కలగాలని క్యాండిల్ ర్యాలీ



మోతీనగర్: వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన వారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే జావిద్ అలీ, పల్లపు వేణులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులో ప్రీతి ఆత్మకు శాంతి కలగాలని క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంతో భవిష్యత్ ఉన్న ప్రీతి లాంటి విద్యార్థినీలు వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం ఎన్నో చర్యలు తీసుకున్నప్పటికి ఇంకా పలు సంఘటనలు పునరావృతం అవటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో దూడల రవిగౌడ్, దివాకర్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం

రాయదుర్గం: ఆసియాలో టాప్–20 ఆర్ట్స్ అండ్ హ్యూమనిటీస్ పరిశోధకుల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ ఫ్యాకల్టీ ప్రతినిధులకు అవకాశం దక్కింది. వరుసగా నాలుగో సంవత్సరం విడుదల చేసిన సెంటర్ ఫర్ పబ్లికేషన్స్ ఎథిక్స్, సావిత్రిబాయి పూలే పూణే విశ్వవిద్యాలయ నివేదిక 'భారతదేశం, దక్షిణాసియా, తూర్పు ఆసియాలో కళలు, హ్యూమనిటీస్ పరిశోధనలో ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు నారాయణచంద్రన్, ప్రమోద్.కె.నాయర్‌లకు అవకాశం లభించింది. ప్రొఫెసర్లకు గుర్తింపు రావడం ఆనందకరమని హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు.

క్రైం కార్నర్..

వ్యక్తి అదృశ్యం



మల్లేష్ (ఫైల్)

బాలానగర్: మానసిక పరిస్థితి సరిగ్గా లేని వ్యక్తి ఇంట్లోనుంచి బయటకు వెళ్లి తిరిగి రాని సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... రాజు కాలనీ మీ సేవా సమీపంలో తిమ్మమ్మ, మల్లేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. గత నెల 22వ తేదీన మల్లేష్ (50) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ లభ్యం కాకపోవటంతో భార్య తిమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మల్లేష్ కన్నడ, హిందీ, తెలుగు భాషలో మాట్లాడతారని తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిలిండర్

గ్యాస్ ధర పెంపుపై భగ్గుమన్న బీఆర్ఎస్

పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి భారం వేసిన కేంద్రం ఇప్పుడు వంట గ్యాస్ ధరను పెంచి వారి రక్తాన్ని పీల్చుతోందని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై గురువారం బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎంతసేపు కార్పొరేట్ సంస్థల కోసమే ఆలోచిస్తోందని... పేదల గురించి ఆలోచించడం లేదన్నారు. ప్రతి వస్తువుపై జీఎస్‌టీ పేరుతో జలగల్లా ప్రజల రక్తాన్ని పీలుస్తున్నారనడానికి ఇదే నిదర్శనం అన్నారు. సామాన్యులను పీడిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

– కూకట్‌పల్లి



అల్లాపూర్ డివిజన్‌లో కట్టెపొయ్యలపై వంట చేస్తు నిరసన తెలిపిన కార్పొరేటర్ సబిహా బేగం



పాపిరెడ్డినగర్‌లో నిరసన తెలుపుతున్న ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



నిరసన తెలుపుతున్న ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ తదితరులు



నిరసన ర్యాలీలో పాల్గొన్న కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు



కేపీహెచ్‌బీకాలనీలో ధర్నా చేస్తున్న బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీష బాబూరావు



కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసన తెలుపుతున్న బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి



కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

తెలంగాణ ప్రభుత్వం చెప్పేదొక్కటి చేసేది మరొకటి

టీపీసీసీ సభ్యులు డాక్టర్ సత్యం శ్రీరంగం

ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు చెప్పేదొక్కటి చేసేది మరొకటని... ప్రజలు గుర్తించి కాంగ్రెస్ పార్టీని అధికారంలో తెస్తే ప్రజా పాలనకు నాంది పడుతుందని టీపీసీసీ సభ్యులు డాక్టర్ సత్యం శ్రీరంగం అన్నారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని గంగపుత్ర సంఘం, ఫ్రెండ్స్ కాలనీ, భవానీనగర్‌లో ఇంటింటికీ తిరిగి రాహుల్‌గాంధీ సందేశం కలిగిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో 14 చెరువులు ఉంటే 10 చెరువులు కబ్జాకు గురయ్యాయని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు ఒకే తాటిపై నడుస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నల్లోల రాజేందర్, మహేష్‌యాదవ్, అశోక్, కిరణ్‌గౌడ్, జహంగీర్, మోయిజ్, ఫిరోజ్, మహమ్మద్ నసీర్ పాల్గొన్నారు.



హాత్ సే హాత్ జోడోలో వృద్ధురాలితో మాట్లాడుతున్న సత్యం శ్రీరంగం

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం



పాపిరెడ్డినగర్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై గురువారం ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీలు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

◆ ఈ సందర్భంగా రాజస్థాన్, బీహార్ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారిని ఎంపీ రంజిత్‌రెడ్డి పలకరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆసరా పింఛన్లు, రైతు బంధు, రైతు బీమా వంటి అనేక పథకాలను అందజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, కమిటీల ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ ఏర్పాటుకు కృషి చేస్తాం

మోతీనగర్: సుమారు 10 సంవత్సరాల క్రితం మోతీనగర్ ప్రధాన రోడ్డులో బస్సు షెల్టర్ ఉండేది. ఆధునీకరమైన బస్సు షెల్టర్ నిర్మాణం పేరుతో ఉన్న బస్సు షెల్టర్‌ను తొలగించారు. పలుమార్లు నూతన బస్సు షెల్టర్ నిర్మాణం కోసం సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిదులు భూమిపూజ సైతం చేశారు. అనివార్యకారణాల వల్ల అది అమలు కాలేదు. బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని బుధవారం కూకట్‌పల్లి డిపో మేనేజర్ మహ్మద్ సయ్యద్‌ను మోతీనగర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అంజిరెడ్డి కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి గురువారం మోతీనగర్ చౌరస్తా ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో అధికారులతో మాట్లాడి బస్సు షెల్టర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

గచ్చిబౌలి: అత్యవసర సమయాల్లో పక్కన ఉన్నవారి ప్రాణాలను రక్షించడానికి బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) శిక్షణ చాలా ముఖ్యం. ప్రధానంగా సీపీఆర్ చేయడం తెలిస్తే ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వెలుపల ప్రాంతంలో సుమారు వంద మంది సైక్లింగ్ సంఘం సభ్యులకు ఎస్ఎల్‌జీ ఆస్పత్రికి చెందిన ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ టి అప్పిరెడి ఆధ్వర్యంలో అదే విభాగానికి చెందిన డాక్టర్ హేమసింధు, డాక్టర్ విఠల్‌లు సభ్యులతో బొమ్మలపై సీపీఆర్ ప్రాక్టీస్ చేయించారు. ప్రతి ఒక్కరూ స్వయంగా చేయడం ద్వారా ఎక్కడ ఎంతసేపు కంప్రెషన్లు ఇవ్వాలో తెలుసుకున్నారు. ఇది తోటి వారి ప్రాణాలను కాపాండేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పిల్లలను ఒంటరిగా బయటకు పంపొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లింగస్వామి తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: విద్యార్థులు కుక్కల బారిన పడకుండా తగిన జగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ వెటర్నరీ డాక్టర్ లింగస్వామి తెలిపారు. గురువారం హస్మత్‌పేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో వీధి కుక్కలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భయపడే కుక్క మీకు దగ్గరగా వస్తే వెనుకకు తిరిగి పరుగెత్తవద్దన్నారు. కుక్కలపై రాళ్లు, కర్రలు విసరడం చెయ్యవద్దన్నారు. కుక్కల కళ్లల్లోకి సూటిగా చూడకూడదన్నారు.

కుక్క కరిస్తే ఏమి చేయాలి..?

కుక్క కరిచిన వెంటనే ధారగా పడే నీటి క్రింద సబ్బుతో 10 నిముషాల పాటు గట్టిగా ఒత్తి కడగాలని తెలిపారు. దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లి వైద్యున్ని సంప్రదించాలని కోరారు. రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ మమత, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, స్కూల్ ప్రిన్సిపాల్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు



కూకట్‌పల్లి: ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ పార్టీ ఘన విజయం సాధించటం పట్ల గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుంటూ కార్యకర్తల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. మోదీ చరిష్మా ఇంకా 10 సంవత్సరాల వరకు ఇలాగే కొనసాగుతుందన్నారు. ఇది కార్యకర్తల నైతిక విజయం అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్ రావు, మణిభూషణ్, నర్సింగ్ రావు యాదవ్, భూపాల్ రెడ్డి, నర్సింగ్‌రావు, వెంకటస్వామి రెడ్డి, గోపాలరావు, కుమార్‌యాదవ్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'మలబార్ గోల్డ్' స్కాలర్‌షిప్‌లు

కూకట్‌పల్లి: భారతదేశంలో అతి పెద్ద బంగారు, వజ్రాభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో గురువారం కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నగరం నలుమూలల నుంచి విద్యార్థులు విచ్చేశారు. మలబార్ గ్రూప్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ స్కాలర్‌షిప్‌లు అందజేసినట్లు కూకట్‌పల్లి జోనల్ హెడ్ షానిబ్, స్టోర్ హెడ్ కెయన్ శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌లను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, శిరీష బాబూరావులు ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఏదైనా కష్టం వచ్చినప్పుడు తల్లిదండ్రులకు, మీ స్నేహితులకు చెప్పుకొని పరిష్కారం కోసం అన్వేషిస్తే తప్పకుండా దొరుకుతుందన్నారు. 631 మంది విద్యార్థులకు మలబార్ గోల్డ్ సంస్థ వారు స్కాలర్‌షిప్‌లు అందజేయటం అభినందించదగ్గ విషయమన్నారు.



స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు

వీధి కుక్కలతో బెంబేలు

వెంట పడి తరుముతున్న గ్రామ సింహాలు

మోతీనగర్: కొన్ని రోజుల నుంచి వీధి కుక్కల బెడద రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. వారం రోజుల నుంచి ఎండలు ఎక్కువగా పెరగుతూ ఉండటంతో వీధికుక్కలు చెలరేగి పోతున్నాయి. కొన్ని రోజుల కిందట వీధికుక్కల పాలిట పడి ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన మరువక ముందే.. అనేక ప్రాంతాల్లో ఈ వీధికుక్కల బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు వైద్యం లభించక ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది.

◆ మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని పలు బస్తీ, కాలనీల్లో వీధి కుక్కలు తిష్ట వేసి మనుషులపై దాడులకు దిగుతున్నాయి. అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్, తులసినగర్, శ్రీ వివేకానందనగర్, గాయత్రినగర్, అల్లాపూర్, వి. రామారావు నగర్, మూసాపేట డివిజన్‌లోని మోతీనగర్, బబ్బుగూడ, అవంతినగర్ తోట, కబీర్‌నగర్ వంటి తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల హడావుడి అంతా ఇంతా కాదు. వాహన చోదకులపై కూడా దాడి చేస్తున్నాయి.

◆ ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణిస్తే కుక్క కాటుకు గురి కావటంతో రోడ్డు ప్రమాదానికి గురి కావాల్సిందే. ఉదయం వేళల్లో పేపర్, పాలు వేసే వారిని వెంబడించి తరుముతున్నాయి. ముఖ్యంగా వాకింగ్‌కు వెళ్లే వాకర్స్‌పై సైతం దాడులకు దిగుతున్నాయి. ఇళ్ల అరుగుల ముందు, ఆగి వున్న ఆటోల్లో నిద్రిస్తూ ఎటువంటి శబ్దం వచ్చినా ఒక్కసారిగా మీద పడి పీకుతున్నాయి.





అల్లాపూర్, మూసాపేట డివిజన్లలో వీధి కుక్కలు



◆ ఇటీవల ప్రభుత్వం వీధి కుక్కలకు ఆపరేషన్‌లు చేసే నిమిత్తం వాటిని తరలించి తిరిగి అదే ప్రాంతంలో వదిలి పెడుతున్నారు. ముఖ్యంగా నగరంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకొని జీహెచ్ఎంసీ సిబ్బంది తరలించటానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా వారిని గుర్తించి అవి పారిపోతున్నాయి. ఆరు బయట పడుకున్న వీధి కుక్కలు వృద్ధులు, పిల్లలు బయలకు వెళ్లే సమయంలో వారి వెంట పడి దాడుల చేస్తూ వారి చేతుల్లో ఏమి ఉంటే వాటిని లాక్కుంటున్నాయి.

వీధి కుక్కల నుంచి కాపాడాలి...



అవంతినగర్ తోటలో ఇటీవల కాలంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, మాంసం ముక్కలు వేయటంతో వాటిని తినటానికి అక్కడే తిష్ట వేస్తున్నాయి. ఎవరైనా వాటిని అదిలిస్తే ఒక్కసారిగా మీదపడి దాడులకు దిగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధింత అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల నుంచి కాపాడాలి.

– ఏలూరి ప్రసాద్, అవంతినగర్ తోట